


అద్దోపల్లె. మా బాబు నక్కడికి మార్చారు. ఆ వూరి హైయర్ ఎలిమెంటరీ బడి హెడ్ మాష్టరన్నమాట మా బాబు. నాకు వ్రాసాడు తనకు చాల బాగున్నదని, అందరు చాల మర్యాదస్థులని ముఖ్యంగ ఆ వూరిమాలోల్లు. మంచి వూరికి మా బాబును బదిలి చేసినందుకు బోర్డువారిని ఒక్కసారి మనస్సులో పొగిడా.

సెలవులకు—ఎండాకాలం సెలవులకు పోయాను ఆవూరు మా యిల్లు మాల పెల్లెకు దగ్గరగాయుంది. బడిమాలపల్లిలో నుంది. అంటురోగం పోవాలని ఆబోర్డు ప్రెసిడెంటు గారు అట్లాబడిల్లు కట్టించారంట. నేను వచ్చానని వినగానే ఆమాల పల్లెలోని ఆ బాలగోపాలం నన్నుజూడవచ్చింది. పెండ్లికి మాలెవిరగ బడిపోయారు.

వచ్చిన గుంపుయింటికి మళ్ళింది. ఆ మొకవ్యక్తి. నవీన రేవతి. పదహారు ఏళ్ళ కంటె యెక్కువయుండదు వయస్సు. ఆవిశాల వక్షస్థలం ఆ కాంచన మాలనేత్రాలు ఆ హంసనడక దొండపండువంటి ఆశరీరం జూడగానే నేనే వికారం పొందాను. అంటే నన్ను మా కాలేజీలో సాధువనే వాళ్లు. తానుకూడా సలాం పెట్టింది. తల వంచిపోతుంది. మాలపిల్ల. ఆవిడే సుంది. అది ముద్దుపేరు. సుందరి అసలు పేరు.

మా బాబు చాలమట్టుకు కాంగ్రెసు ఆశయాలు గలవాడుగాని దానిలో జేర లేదు. 'పార్టీలెందుకు నాయనా' యని నాకు జెప్పేవాడు. పార్టీకిజెంది దాని ఆశయాలు నెరవేర్చకపోవుట మహాదోషం. చెప్పటంకంటె జేయుటం ముఖ్యం. అట్టిది యేపార్టీలో లేదు. కాబట్టి తటస్థము మంచిదని మా తండ్రిగారి పట్టుదల. అదే నాకూ అబ్బింది.

చాల సంతోషంగ ఆ సెలవులు గడిపి మరల కాలేజికిపోయూ. ఎప్పుడు జూచిన మావూరు మనస్సులో వుండేది. ఆవూరిలో నాకుకల్గిన గౌరవానికి పొంగిపోయేవాడ్ని.

ఆయేడు పరీక్షలువ్రాసి యింటికొచ్చాను. మావూరిలో సందడిలేదు. ఎవరు నన్నుజూడ రాలేదు. అసలు యెవరునాతో పలికే వాళ్లుకాదు. చివరికి సుందిగూడా యేవగించిందేమో నేనంటే! యెప్పుడు కను పల్లేదు. చాల వింతయింది మెదడుకు వ్యాయామం పెట్టాను. కాని ఫలించలేదు. మా బాబు 'కాలమహిమ'ని మా అమ్మ 'చదివినోళ్ళ పన'ని రెండింటితో ముగించారు. నాకుమాత్రం మహాబాధ కలిగిల చాయా రెండుమాటలు.

కారణం తెలిసికొందామని సాయం త్రమే షికారు బయలుదేరాను. ఎవరు పలుకరించలేదు. చివరికి పుల్లమ్మ—సుంది తల్లిదగ్గరికెళ్ళాను. 'సుంది యెక్కడికెళ్ళిం దని' అడిగాను. అప్పుడంది పుల్లమ్మ : ఓ రెండు చదివిన పిల్లలగుంపు లొచ్చినవని. అందరు మంచి మంచి సంగతులు జెప్పారని అసలువాళ్ళు మాలోల్లని హరిజనులని పిలిచి కులభేదంలేదని జెప్పారని. సుందిని వాళ్ళనాయకుడు చంద్రశేఖరంగారు పెండ్లి చేసికొని పోయాడని జెప్పింది. చాలసంతోషించాను. సుందికి చదివిన మొగుడుదొరికినందుకు దేవుని మ్రొక్కాను. సుంది పెండ్లి లోకానికి ఆదర్శమనియెంచి మురిసిపోయాను. ఇంతకు మావూరిలోని అలజడి. పాపనులని, నాగరికతని తెలిసికొన్న ఆయేడు నుండి రాజకీయపార్టీల విరోధం మొదలైంది. పల్లెవాళ్ళకు పోరాటం తెచ్చేవి పార్టీలు.

సరే రోజులు గడిచాయి. ఇబ్బందుల వల్ల చదువుమానేసి 'గ్రేన్ పర్ చేసింగ్' యిన్స్పెక్టరుగా జేరాను. నన్ను మావూరికి చాలదూరంలో వేసారు. అదిబస్తీ. వంటకు, నీళ్ళకు మహాయిబ్బంది పడేవాడిని. నా ప్యూన్‌కు వంటజేయటంరాదు. సరే ఓపనిమనిషిని కుదర్చమని జెప్పాను ప్యూన్‌కు. వాడు మరునాడే కుదుర్చుకొచ్చాడు. పనిమనిషికి నేమేమిజేయాలో చెప్పాలని వంటగదిలోకి పోయాను... 'పేరిమిటమ్మాయి' అన్నా. తలెత్తినాకేసి చూచింది సుంది. స్వరం గుర్తించి సిగ్గుపడ్డది. కన్నీటితో బయటికి పోతుంది. గుర్తించాను. అది సుంది మావూరి రతీదేవి. 'సుందీ! ఏమిటీ బ్రతుకన్న?' నీటిని వదలుతూఅంది సుంది: 'కాలమహిమ చదివినోళ్ళ దేశభక్తి' అంది. 'సుందీ? నీవు నాసోదరిలాంటిదానవు ఏమి జరిగింది. చెప్ప' మన్న. ఏడుస్తుఅంది సుంది: చంద్రశేఖరం మోసం జేశాడని కామంకొరకే వివాహ మాడాడని తనబోధ తనకుకాదని బోధించేవాడు చేయడని, తమకీర్తి కలుగుటకే సంఘములని జెప్పి బహు బాధించి అక్కడవదలి గుంటూరు పోయాడని చెప్పింది. పూర్తిసంగతి తేలలేదు. మరల సుందిని చెప్పమని వేడాను. అప్పుడంది సుంది: బాబు!...పాపిని కామంలోపడి జెడ్డాను. మోసగింపబడ్డ నాకిది తొమ్మిదో...అంది. మూర్ఛబొందింది... తెప్పరిల్లి... అమ్మపో యిందని ఘోరుమంది. అదా నవీననాగరికులపనని వగచి సుందిని యింటిలోచేర్చి మానాన్నకు తెలియపర్చాను.

అట్లా పక్షంగడిచింది. ఓనాడు ఆఫీసుకు కబురువచ్చింది సుందికి ప్రమాదస్థితని. వెంటనే డాక్టరమ్మను పిలిచాను. శిశువు మరణించాడని చాల ప్రమాదమని జెప్పింది.